క్లుప్తంగా

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామం శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం 39వ వారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగాలని ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీరామ నామక్షేత్రంలో గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని శ్రీ రామ నామక్షేత్రంలో మంగళవారం గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాలలో తేలప్రోలు శ్రీనివాసరావు, లావణ్య దంపతులు పాల్గొన్నారు. శ్రీ సీతారామాంజనేయ భజన మండలి ఆర్గనైజర్ గుడిపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అర్థ ఏకాహం సాయంత్రం 6 నుంచి ప్రారంభమై.. బుధవారం ఉదయం 6 గంటల వరకు జరిగింది.

17 వాహనాలు.. రూ.2.82లక్షలు

నగరం: నాటుసారా, మద్యం అక్రమ రవాణ కేసుల్లో పట్టుబడిన 17 వాహనాలను వేలంలో పాటదారులు దక్కించుకున్నారని ఎస్‌ఈబీ సీఐ దేవర శ్రీనివాసరావు వెల్లడించారు. నగరంలోని ఎస్‌ఈబీ స్టేషన్‌లో మంగళవారం వాహనాల వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో పట్టుబడిన 45 వాహనాలకు వేలం నిర్వహించగా.. 17వాహనాలను రూ.2.82లక్షలకు పాటదారులు దక్కించుకున్నట్లు తెలిపారు. మిగిలిన 28 వాహనాలకు పాటదారులు ఎవరూ.. ముందుకు రాలేదన్నారు. ఈ వాహనాలకు త్వరలోనే వేలం నిర్వహిస్తామని తెలిపారు.

పెండింగ్ అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

ఆర్డీఓ పార్థసారథి



చెరుకుపల్లి: ల్యాండ్ కన్వర్షన్‌కు వచ్చిన ఆన్‌లైన్ అర్జీలను త్వరితగతిన విచారించి, పరిష్కరించాలని రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ అర్జీలను మంగళవారం తహసీల్దార్ ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు ల్యాండ్ కన్వర్షన్‌కు వచ్చిన 32 ఆన్‌లైన్ అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమ లేఅవుట్లు వేస్తే.. వాటిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు



చెరుకుపల్లి: మండలంలోని ఆళ్లవారిపాలెం, తూర్పుపాలెం గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించబడిన కూరేటి గోపీకృష్ణ, కై తేపల్లి స్రవంతికి ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా ఎక్కువ పనులు గుర్తించి జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించాలని కోరారు. ఆళ్లవారిపాలెం సర్పంచ్ కూరేటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తూము కోటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఈసీ ఎ.అరుణ, టీఏ శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు..

యలవర్రులో 'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి నాగార్జున



యలవర్రుగ్రామంలో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

యలవర్రు(వేమూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలు వద్దకే తీసుకుని వెళ్లడం జరుగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలం యలవర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మంత్రి మేరుగ నాగార్జున ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీఓ నెం.1 తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడి బహిరంగ సభల వల్ల ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందు వల్లే ఆంధ్రప్రదేశ్‌లో సదరు జీవోను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగన్, వైఎస్ షర్మిల పాదయాత్ర చేశారని..కానీ, ఎక్కడా ప్రమాదాలు జరగలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. దీంతో బీసీలందరూ.. వైఎస్సార్ సీపీకి మద్దతివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండే నాగేశ్వరరావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జడ్పీటీసీ మూల్పూరు లావణ్య, రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టర్ ఓలేటి శివాజీ, ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీరాణి, సొసైటీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, మానుకొండ నాయుడమ్మ, ఇంటూరు బాబురావు, టి.భీమయ్య, మామిడిపల్లి రాణి, కుంభం నాగలక్ష్మి, కొండసీమ జయంతి రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు.. ఎంపీ ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రాధాకృష్ణమూర్తి తదితరులు

రేపల్లె రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరులో అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రకటించిన ఆర్థిక సాయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం అందజేశారు. ఆంజనేయస్వామి కాలనీకి చెందిన పడవల చిరంజీవి వెంకట సాయి(10) బ్రెయిన్ క్యాన్సర్‌తో, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పేటేరులో గోడ కూలి అంబేడ్కర్ అనే వ్యక్తి, 2వ వార్డులోని ఆరేపల్లి గోపి అనే వ్యక్తి క్యాన్సర్‌తో మృతి చెందారు. మృతుల కుటుంబాలకు రూ.10వేలు చొప్పున నగదును అందించారు. భవిష్యత్‌లోనూ ఆయా కుటుంబాలకు అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, లీగల్ సెల్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు అల్లంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ రావు లక్ష్మీ ప్రభాకర్, పంచాయతీ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేలు వితరణ

రేపల్లె రూరల్: పేటేరు గ్రామంలో నిర్మిస్తున్న ఓంకారం గుడికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ప్రకటించిన రూ.25వేలు నగదును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు అల్లంశెట్టి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు రావు లక్ష్మీప్రభాకర్‌రావు, పార్టీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని పేర్కొన్నారు.

వైద్యశాలలో నగదు చోరీ..

రేపల్లెరూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో నగదు చోరీ చేసిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. పట్టణంలోని 10వ వార్డులో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో సిబ్బంది విధులు ముగించుకొని సోమవారం రాత్రి తలుపులు మూసివేసి వెళ్లిపోయారు. రక్త పరీక్ష కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి టేబుల్‌లో ఉన్న రూ.25వేల నగదును చోరీ చేసినట్లు ల్యాబ్ టెక్నీషియన్ ఇన్‌చార్జ్ బుజ్జిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

12,13న పౌరాణిక నాటిక సన్నివేశాల పోటీలు

తూములూరు(కొల్లిపర): శ్రీసీతారామాంజనేయ నాట్యకళామండలి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 12, 13 వ తేదీలలో తూములూరు గ్రామంలో మర్రెడ్డి సుబ్బారెడ్డి ట్రస్ట్ కళ్యాణమండపంలో పౌరాణిక నాటిక సన్ని వేశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు కొల్లి బసివిరెడ్డి తెలిపారు. ఈ పోటీలల్లో ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సంగీతము కు వేయ్యి రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. కావున ఆస్తకి ఉన్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండా శివారెడ్డి, కొల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కొల్లి కిషోర్‌రెడ్డి,అవుతు సంజీవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వానర సైన్యం.. భట్టిప్రోలులో బీభత్సం



గోడపై చేరిన వానరాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో వానర సైన్యం అధికమైంది. కోతుల బెడదకు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా చేతుల్లో తినుబండరాలు, వస్తువులు కనిపిస్తే.. వెంటపడి మరీ లాక్కెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా విఠలేశ్వరనగర్‌లో కోతుల బెడత అధికంగా ఉంది. వానర దాడిలో గాయపడి ఆసుపత్రి పాలైన వారు చాలా మంది ఉన్నారు. లంక గ్రామాల్లో ఉండే వానర సైన్యం ఇక్కడకు దండెత్తుతోంది దీంతో స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. దాబాలపైకి ఎక్కితే.. ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడిపోతున్నారు. తలుపులు తెరిస్తే ఇళ్లలోకి ప్రవేశించి నానా బీభత్సం చేస్తున్నాయని హడలిపోతున్నారు. సెంటర్‌లో చిన్న చిన్న వ్యాపారాల దుకాణాల్లో కోతులు ఎగబడుతున్నాయి. తినుబండారాలతో చల్లగా చెక్కేస్తున్నాయి. స్థానికులు పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు ఇటీవల పంచాయతీ అధికారులు విఠలేశ్వరనగర్ కాలనీలో కొండముచ్చుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటినీ అవి పసిగట్టేశాయి. అధికార యంత్రాంగం కోతుల బెడదను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించండి

జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: అంటు వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం సూచించారు. తెనాలిలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మంగళవారం అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి అవి కుట్టటం వల్ల మలేరియా, డెంగూ, చికెన్ గున్యా, బోధకా లు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒకరు శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులపై అందరికీ అవగాహన కల్పించటంతో పాటు తీవ్ర జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వారికి మలేరియా పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే అలాంటి వారికి అవసరమైన మందులను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారులు డి.రాజు నాయక్, వి.పున్నారెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నరసయ్య, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

శ్రీవారి తెప్పోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

తెనాలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆరోజు పట్టణంలోని నిజాంపట్నం కాల్వపై నిర్వహించాల్సిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి తెప్పోత్సవ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్, ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల అధికారులతో 15వ తేదీన సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జరిగే తెప్పోత్సవం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైకుంఠపురం ఆలయం నుంచి విజయవాడ రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం వరకు తెప్పోత్సవం ఘనంగా జరిగేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. వివిధ విభాగాల అధికారులు, సీఐలు కె.చంద్రశేఖర్, వెంకట్రావు, శ్రీనివాసులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్యాషియర్‌పై దాడి

తెనాలిరూరల్: బార్ అండ్ రెస్టారెంట్ క్యాషియర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ శాలిపేటలోని సాయి బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్‌కు సోమవారం రాత్రి ముగ్గురు యువకులు వచ్చారు. బార్ యజమాని ఫోన్ నంబరు కావాలంటూ క్యాషియర్ వాకా దుర్గాప్రసాద్‌ను అడిగి అతనిపై దాడి చేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి నిందితులను బండి ప్రేమ్‌కుమార్, ఖాజా, వీరి స్నేహితుడు మరో యువకుడిగా గుర్తించారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



మాట్లాడుతున్న జలజీవన్ మిషన్ కో-ఆర్డినేటర్ దయాకర్

పేరలిపాడు(కర్లపాలెం): గ్రామాలలో స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని జలజీవన్ మిషన్ బాపట్ల కో–ఆర్డినేటర్ దయాకర్ తెలిపారు. పేరలిపాడు గ్రామంలో మంగళవారం సర్పంచ్ కాగిత కరుణకుమారి అధ్యక్షతన తాగునీటిపై జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దయాకర్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ పరిశుభ్రమైన నీటిని అందిచేందుకు ప్రభుత్వాలు పైప్ లైన్లు వేసి, కొళాయిలు ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించండి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ

బాపట్ల అర్బన్: గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలని, ఈ పనులను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ చంద్ర సువార్త పేర్కొన్నారు. నరసాయపాలెం పంచాయతీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ దాసి హైమావతి, పంచాయతీ కార్యదర్శి బత్తుల రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక

కర్లపాలెం: గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా పెదగొల్లపాలెం పాస్టర్ ఏసురత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్లపాలెం పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీలోని క్రైస్తవ ప్రార్థన మందిరంలో మంగళవారం పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్లపాలెం మండల గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బిషప్ డానియేల్, ప్రధాన కార్యదర్శిగా ప్రసంగి, ఉపాధ్యక్షుడిగా జక్రయ్య, ట్రెజరర్‌గా కార్యవర్గ సభ్యులుగా స్టీఫెన్ , ఏసుబాబు, కృపావరం, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడుతూ ఫెలోషిప్ సభ్యుల సంక్షేమానికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు గిరిబాబు, శ్యామ్యూల్, కృపావరం తదితరులు పాల్గొన్నారు.



గ్రేస్ ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఎమ్మెల్యే కోన రఘుపతి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: పట్టణ ప్రాంతాలతో ధీటుగా గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని అసోదివారిపాలెం, పోతురాజు కొత్తపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..లేదా.. అని అడిగితెలుసుకున్నారు. ప్రజలు తమకు అందుతున్న సాయాన్ని ఎంతో గొప్పగా చెప్పారు. ఎమ్మెల్యేను చిరునవ్వుతో ఆప్యాయంగా పలికరించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిచే సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, మేడిబోయిన బ్రహ్మారెడ్డి, నాగార్జునరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మత్స్యకారులకు మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని ఐదుగురు మత్స్యకారులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తున్న మోటారు సైకిళ్లు, ఐస్‌బాక్స్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. మత్స్యకారులకు వేట నిషేధం సమయంలో ఉపాధి కల్పించి, కరువు భత్యాన్ని సకాంలో అందిస్తున్నామని చెప్పారు. రాయితీపై డీజిల్ సరఫరా కొనసాగుతుందని చెప్పారు. మత్స్యకారులకు ప్రత్యేకమైన కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తద్వారా రుణాల అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీఏ సురేష్, కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా తదితరులు ఉన్నారు.

మాకు అవకాశం కల్పించండి..

బాపట్ల : ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న గ్రామ సచివాలయం ఉద్యోగాల్లో పశు సంవర్థక విభాగంలో పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న తమకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు విద్యార్థులు ఎమ్మెల్యే కోన రఘుపతికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన నివాసంలో మంగళవారం ఎమ్మెల్యేను విద్యార్థులు కలిశారు. త్వరలో ప్రకటించనున్న 5,188 పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 840 మంది చివరి సంవత్సరం విద్యార్థులకు అవకాశం కల్పించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. పి.శ్రీనివాసమూర్తి, వెంకటేశ్వర్లు, ప్రసన్న తదితరులున్నారు.

శ్రావ్య మృత దేహానికి మంత్రి నాగార్జున నివాళి



అద్దేపల్లిలో శ్రావ్య మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున

అద్దేపల్లి(భట్టిప్రోలు): ప్రియుడి చేతిలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి గ్రామానికి చెందిన వివాహిత కనపర్తి శ్రావ్య మృత దేహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున నివాళులర్పించారు. మంగళవారం శ్రావ్య మృతదేహాన్ని సందర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ కంభం మరియమ్మ, సంఘ పెద్దలు, దళితవాడ వాసులు అభాగ్యులైన ఇద్దరి చిన్నారులకు ప్రభుత్వ పరంగా న్యాయం చేయాలని కోరారు. న్యాయం చేసేందుకు కృషి చేస్తానని, ఈ కేసు విషయంలో పూర్వాపరాలను విచారించి, నిందితుడైన గాలి కిరేష్‌ను కఠినంగా శిక్షించాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. ఆయన వెంట వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు, అద్దేపల్లి ఆర్బీకే వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాసుమల్లి జాన్‌క్రిష్టాఫర్, పంచాయతీ వార్డు సభ్యులు కె. శ్రీనివాసరావు, కె.ఫకీర్, చేబ్రోలు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు టి.యలమంద, డి.శేషయ్య, పి.విజయరాజు, కె.రమేష్, పీజీ అరుణ్‌శాస్త్రి, వి.బాలసుబ్రహ్మణ్యం, ఎం.కోటేశ్వరరావు, వి.నాగేశ్వరరావు తదితరులున్నారు.

శ్రావ్య మృతదేహానికి అంత్యక్రియలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): శ్రావ్య మృతదేహానికి మంగళవారం రాత్రి స్థానిక సంఘ పెద్దలు, దళితవాడ వాసులు అంత్యక్రియలు పూర్తిచేశారు. సాయంత్రం పోలీసులు కిరేష్‌ను భట్టిప్రోలుకు తీసుకువస్తున్న క్రమంలో అతడు స్పృహ తప్పి పడిపోవడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు 108లో పోలీస్ బందోబస్తుతో తరలించారు. శ్రావ్య ఇద్దరి పిల్లలకి రూ.4 లక్షలు, తన ఇంటిని వారికి వ్రాయిస్తామని కిరేష్ పెద్దల సమక్షంలో ఒప్పుకోవడంతో.. స్థానిక వాసులు మృతదేహాన్ని ఖననం చేశారు.

తైక్వాండోలో మెరిసిన విద్యార్థులకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు మంతెన సత్యనారాయణరాజు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నాలుగు పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీవీ కృష్ణారావు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 24, 25వ తేదీల్లో ఒంగోలులో జరిగిన జాతీయ స్థాయి థైక్వాండో పోటీల్లో విద్యార్థులు డి.భాను ప్రకాష్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్ నాగవర్ధన్‌రెడ్డి బంగారు పతకాలు సాధించగా.. ఎం.వెంకట సత్యకారుణ్య, యు.సాయిశ్రీ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యాకమిటీ చైర్మన్ చీరాల సునీత, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వాలి వెంకటశివారెడ్డి, సర్పంచులు మంతెన గంగరాజు, ఉప్పు చెంచులక్ష్మి, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల సేవలు అభినందనీయం

డీపీఓ శంకర్ నాయక్



క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న డీపీఓ శంకర్‌నాయక్

బాపట్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో క్లాప్ మిత్రల సేవలు అభినందనీయమని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ముత్తాయ పాలెం, మరుప్రోలువారి పాలెంలో పని చేస్తున్న క్లాప్ మిత్రలు, షెడ్డు మిత్రలు, పారిశుధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి డీపీఓ నూతన వస్త్రాలు బహూకరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓ పీఆర్డీ పులి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శులు ఝాన్సీలక్ష్మి, డాక్టర్ సాంబ శివరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

● బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బట్టు వెంకయ్య

తెనాలి: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తెనాలికి చెందిన బట్టు వెంకయ్య వరుసగా 12వ సారి నియమితులయ్యారు. ఆయన చుండూరు మండలం, వేటపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు.